నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి సుస్తీ!

- ఉన్నదే అరకొర సిబ్బంది.. అందులో కొందరికి డిప్యుటేషన్
- కొంతమంది సమయపాలన పాటించని వైనం
- ఉదయం 11 గంటలు దాటినా విధులకు హాజరుకాని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న రోగులు



నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ



పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ రాకపోవడంతో మందులు ఇస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)నకు కొంతకాలంగా సుస్తీ చేసింది. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేక ఒకవైపు మండల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఉన్న అరకొర సిబ్బందిలో కొందరిని డిప్యుటేషన్‌పై ఇతర ఆస్పత్రులకు పంపారు. దీనికితోడు పీహెచ్‌సీలో విధులు నిర్వహించే సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం, సమయపాలన పాటించకపోవడంతో నాగిరెడ్డిపేట పీహెచ్‌సీపై స్థానికులకు నమ్మకం సడలుతోంది. ఉదయం 11 గంటలు దాటినా కొంతమంది సిబ్బంది విధులకు రాకపోవడంతో అప్పటికే పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు నిరీక్షణ తప్పడంలేదు.

సకాలంలో అందని వైద్యం..

24 గంటలపాటు సేవలందించే నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందడంలేదు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులుండాల్సి ఉండగా రెండుపోస్టులూ ఖాళీగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం మాచారెడ్డి పీహెచ్‌సీలో విధులు నిర్వహించే డాక్టర్ సృజన్‌ను డిప్యుటేషన్‌పై నాగిరెడ్డిపేటకు పంపారు. అప్పటి నుంచి డాక్టర్ సృజన్ నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలోనే విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 2 నెలల క్రితం ఉన్నతాధికారులు మరో వైద్యురాలిని నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి కేటాయించినప్పటికీ ఆమె విధుల్లో చేరలేదు. దీంతోపాటు ఇక్కడ ముగ్గురు స్టాఫ్‌నర్సు పోస్టులుండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ పరిధిలో 8 మంది ఫస్ట్ ఏఎన్‌ఎంలు విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో 8 మంది సెకండ్ ఏఎన్‌ఎంలను నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి కేటాయించినప్పటికీ వారిలో ఇద్దరిని డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించారు. ఫలితంగా ప్రస్తుతం పీహెచ్‌సీలో ఉన్న అరకొర సిబ్బందిపై భారం పడుతోంది. గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో ఉండాల్సిన ఎంఎల్‌హెచ్‌పీలకు పీహెచ్‌సీలో డ్యూటీలు వేస్తున్నారు. దీంతో గ్రామీణప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో నెలకొన్న సిబ్బంది కొరతను తీర్చడమే కాకుండా పర్యవేక్షణను పకడ్బందీగా చేపట్టి మండలప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం బాన్సువాడలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి రోజూ అన్నం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం వండే పరిసరాలు శుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు



దోమకొండ: ముత్యంపేటలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి ఘనంగా బోనాలను తీశారు. బుధవారం ఉదయం తిరుగు బోనాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతినిధులు సిద్ధ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథేశ్వర ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: స్థానిక విద్యానగర్ శ్రీవిశ్వనాథేశ్వర ఆలయ పంచమ వార్షికోత్సవం ఈ నెల 24న ప్రారంభమౌతుందని, 25న కల్యాణోత్సవం, 26న మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్‌గౌడ్, మోహన్, జగదీశ్వరచారిలు తెలిపారు. కళ్యాణోత్సవం, యజ్ఞంలో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చుక్కాపూర్‌లో సుదర్శన నృసింహ హోమం



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నృసింహ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠాపనోత్సవాలు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని సరంపల్లి భూకన్‌పల్లి వ్యాధిహారక అంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ స్థిర ప్రతిష్ఠాపన మూడు రోజుల ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, సామూహిక యజ్ఞం కార్యక్రమాలను వేదపండితులు అంజనేయశర్మ నిర్వహించారు. బుధ, గురువారాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన జిల్లా పీఎంపీలు, ఆర్‌ఎంపీలు



భిక్కనూరు: హైదరాబాద్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు కామారెడ్డి జిల్లా నుంచి పీఎంపీ, ఆర్‌ఎంపీలు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీఎంపీ, ఆర్‌ఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, 1273 జీవో ప్రకారం ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, సుదర్శన్, బాలకిషన్, నక్క శ్రీనివాస్ ఉన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆర్కే కళాశాలలో రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, కళాశాల కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్‌లు సైదయ్య, దత్తాద్రి, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల హాజరు శాతం పెంచాలి



మద్నూర్(జుక్కల్) : ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధి హామీ ఏపీడీ వామన్‌రావ్ ఆదేశించారు. మండల కేంద్రంలో ని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవా రం ఆయన రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. రానున్న వేసవికాలంలో కూలీలందరికి పను లు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నా రు. ఉపాధి కూలీలందరికి పనులు కల్పించాల ని పేర్కొన్నారు. వేసవికాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా నర్సరీలను కాపాడుకోవాలన్నారు. ఎంపీడీవో రాణి, ఈజీఎస్ ఏపీవో పద్మ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులున్నారు.

ఎస్‌బీఐ క్లర్క్ పరీక్షను వాయిదా వేయండి



బాన్సువాడ : ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల రోజున నిర్వహించే ఎస్‌బీఐ క్లర్క్ పరీక్షను వాయిదా వేయాలని మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బీసీ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు పుట్ట భాస్కర్ మాట్లాడుతూ.. పరీక్షను వాయిదా వేసేందుకు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు పెంట సాయికుమార్, కొమ్ము సాయికుమార్, జ్ఞానేశ్వర్, పుట్ట వినయ్, బాలు తదితరులున్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



బాన్సువాడ రూరల్ : రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు సైబర్‌నేరాలతో జాగ్రత్తగా ఉండాలని బాన్సువాడ షీటీం సభ్యులు సూచించారు. మంగళవారం వారు బోర్లం క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. బాలల హక్కులు, గుడ్, బ్యాడ్ టచింగ్, విద్యార్థినులు, మహిళలపై వేధింపులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ఎస్సై మోహన్, ఏఎస్సై ఉమేర్, కానిస్టేబుళ్లు అనిల్,ప్రభాకర్, రజిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి కొత్త విద్యుత్ స్తంభం

సాక్షి ఎఫెక్ట్..



కొత్త స్తంభానికి అమర్చిన తీగలు, ట్రాన్స్‌ఫార్మర్

బాన్సువాడ రూరల్: నాగారం గ్రామంలో పాత విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరడంతో, ఐదేళ్ల క్రితమే దాని పక్కన కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కాని దానికి తీగలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం మరిచారు. ఈ విషయాన్ని 'స్తంభం అమర్చారు..తీగలు మరిచారు' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన బాన్సువాడ రూరల్ ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ గ్రామానికి చేరుకుని కొత్త స్తంభాన్ని వినియోగంలోకి తెచ్చారు. సాక్షి చొరవతో ఐదేళ్ల సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యతకు తిలోదకాలు



మూడేళ్లకే పగుళ్లు వచ్చిన అంకోల్ జీపీ భవనం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. నిర్మించిన మూడేళ్లకే భారీ పగుళ్లు వచ్చాయి. మెట్లు భవనం నుంచి ఊడి పడి పోవడానికి సిద్ధంగా ఉన్నట్లున్నాయి. గ్రామ పంచాయతీ భవనాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.16లక్షలు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో నిర్మించారు. 2022 ఫిబ్రవరిలో అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈ జీపీ భవనాన్ని ప్రారంభించారు. లక్షల రూపాయలు వెచ్చించిన భవనం అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతాలోపంతో నిర్మించారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే భవనం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్రమం తప్పకుండా నీరు అందించాలి



అక్కంపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో



గొట్టిముక్కుల నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. అక్కంపల్లి పల్లెప్రకృతివనాన్ని, నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని కార్యదర్శి కిష్టయ్యకు సూచించారు. అలాగే పలు సూచనలు, సలహాలిచ్చారు.

దోమకొండ: నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం గొట్టిముక్కుల గ్రామంలో నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎంపీడీవోపాటు టీఏ లింగం, ఎఫ్ఏ అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట పరిధిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): కన్నాపూర్, జగదాంబ తండాలలో నర్సరీలను మంగళవారం ఎంపీవో మలహరి పరిశీలించారు. శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్లులను పరిశీలించి వాటి నిర్వహణను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

కొయ్యగుట్ట తండాలో..

బాన్సువాడ రూరల్ : కొయ్యగుట్ట తండా గ్రామ పంచాయతీలో మంగళవారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి పర్యటించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తగా కాపాడాలని పంచాయతీ కార్యదర్శి రాహేలా బేగంకు సూచించారు.



కన్నాపూర్‌లో .. ఎంపీవో మలహరి



కొయ్యగుట్టతండా నర్సరీలో.. ఎంపీడీవో బషీరుద్దీన్

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భారీ విరాళం



చెక్కు అందజేస్తున్న హెచ్‌ఎం అరుణ జ్యోతి



విరాళం అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం


పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం బేగంపూర్ తండా పాఠశాల హెచ్‌ఎం అరుణ జ్యోతి రూ.2.5లక్షలు విరాళంగా ఛత్రపతి శివాజీ విగ్రహం నిర్మాణ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ సంఘ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహ నిర్వాహకులు తానాజీ, పండరి, రాము, దత్తు, ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌కు సౌండ్‌బాక్సులు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌కు ఇంటర్ సెకండియర్ విద్యార్థులు మంగళవారం రూ.18,500 విలువ చేసే సౌండ్‌బాక్సులను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సౌండ్ బాక్స్‌లను అందజేసిన ఇంటర్ విద్యార్థులను ప్రిన్సిపాల్ రాంప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు..

కామారెడ్డి క్రైం:పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదాన ప్రాంతం నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు ప్రధాన రహదారి వెంబడి కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తమ వంతు సహకారం అందించేందుకు గౌతం మోడల్ స్కూల్ యాజమాన్యం ముందుకు వచ్చి రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేసినట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస వర్మ, ఇన్‌చార్జి సంతోష్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్‌స్కూల్‌కు అందజేసిన సౌండ్‌బాక్సులతో విద్యార్థులు

క్లుప్తంగా

సైన్స్ ఫెయిర్‌తో విజ్ఞానం



ఎల్లారెడ్డి : సైన్స్‌ఫెయిర్‌తో విజ్ఞానం పెంపొందుతుందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరు సైన్స్‌ఫెయిర్‌లో పాలుపంచుకోవాలని అన్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, ఎస్సై మహేష్, ప్రిన్సిపల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, అన్నారం, కొండాపూర్, గుండారం, ఎల్లాపూర్ తండా, నడిమి తండా గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో రఘురాం పరిశీలించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, మంచి నీరు, టేబుల్స్, వీల్ చైర్ వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని సంబంధిత బీఎల్‌వోలకు సూచించారు.

ఇంటర్నల్ మార్కులు..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలం కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను మంగళవారం జిల్లా తనిఖీ బృందం పరిశీలించింది. పదో తరగతి విద్యార్థులు ఎఫ్ఏ-1 నుంచి ఎఫ్ఏ-4 వరకు సాధించిన మార్కులు, ప్రాజెక్టు వర్క్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్షల వారీగా విద్యాభివృద్ధి సాధించారా లేదా అని వచ్చిన మార్కులను బట్టి ప్రతిభను గుర్తిస్తున్నట్లు తెలిపారు. మండల విద్యాధికారి షౌకత్‌అలీ, పరిశీలన బృందం జిల్లా సభ్యులు వేణుగోపాల్, సాయన్న, పాఠశాల సిబ్బంది సిద్దిఖీ, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతం చేయాలని సూచించారు'



కామారెడ్డి క్రైం: మాజీ సీఎం కేసీఆర్‌ను కామారెడ్డికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయపరిస్థితులు, పార్టీ బలోపేతం, తదితర అంశాలపై కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు వారు తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, తదితరులున్నారు.

ఉద్యోగమేళాలో 11మంది ఎంపిక



కామారెడ్డి అర్బన్: నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు ప్రయివేట్ రంగంలో అనేక ఉద్యోగాలున్నాయని, ఆకాశమే హద్దుగా ఉన్నతంగా ఎదగవచ్చని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం టీఎస్‌కేసీ, అప్‌గ్రేడ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులు, ముత్తూట్ ఫైనాన్స్‌లో శాశ్వత ఉద్యోగాలకు మేళా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. అనేక ప్రయివేట్ కంపెనీలు కనీసం డిగ్రీ చదివి తగిన నైపుణ్యాలున్న వారి కోసం సంప్రదిస్తున్నాయన్నారు. ఉద్యోగ మేళాలో 11 మంది ఎంపికయ్యారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, సమన్వయకర్త రాజ్‌గంభీర్‌రావు, మెంటార్ అజారుద్దీన్, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



భిక్కనూరు: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినందుకు ఎమ్మార్పీఎస్ నేతలు ఆయన చిత్రపటానికి భిక్కనూరు మండల కేంద్రంలో మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. మంద కృష్ణమాదిగ 30 ఏళ్ల పోరాటానికి మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. నేతలు లక్ష్మణ్ మాదిగ, శంకర్‌మాదిగ, తుడుం జీవన్, దయాకర్, రమేష్, తదితరులున్నారు.

సంక్షిప్తం

స్వయంపాలన దినోత్సవం



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల టీచర్ల తరహాలోనే పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, నరేష్, లింగం, టి.శ్రీనివాస్, హనీఫ్, మహిపాల్ ఒక్క రోజు ఉపాధ్యాయుల పనితీరును గమనించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

మాచారెడ్డి: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ సూచించారు. మంగళవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్స్ లేని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు.

జీపీలకు నిధులు విడుదల చేయాలి



పిట్లం(జుక్కల్) : గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఎంపీడీవో కమలాకర్, మండల పంచాయతీ అధికారి రాములకు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జీపీల కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు లేక పాలనపరంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి డబ్బులు చెల్లించాల్సి ఉందని, ఈ నెల ఆఖరి వరకు నిధులు విడుదల చేయాలని కోరారు.

పర్యావరణపరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పీఎంశ్రీ ఎక్స్‌పర్ టాక్‌లో భాగంగా శ్రీనివాస్ రాజారాం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎదురయ్యే పరిణామాలపై వివరించారు. పెస్టిసైడ్స్ వాడటం వల్ల క్యాన్సర్ లాంటి జబ్బులు వస్తున్నాయన్నారు. గోమూత్రాన్ని ఉపయోగించి పంటలకు హాని చేసే క్రిమికీటకాల నివారణ చేపట్టవచ్చన్నారు. వర్మి కంపోస్ట్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఎంఈవో యోసెఫ్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రకు తరలిన మోడల్ స్కూల్ విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్ : పట్టణంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహారయాత్ర కార్యక్రమానికి తరలి వెళ్లారు. అందులో భాగంగా రుద్రూర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రం, తెలంగాణ తిరుపతి, బాసర సరస్వతి ఆలయం, డిచ్‌పల్లి రామాలయాన్ని సందర్శించారు. విజ్ఞాన విహార యాత్రతో విజ్ఞానం పెంపొందుతుందని ప్రిన్సిపాల్ గాంధీ అన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్ సింగ్, రాజశేఖర్, బల్వంత్ రావు, ప్రభాకర్, సునీత, శ్రావణి, గోపి తదితరులు పాల్గొన్నారు.